క్లుప్తంగా

పైపులైను లీకేజీకి మరమ్మతులు



మరమ్మతులు పూర్తయిన పైపులైను

సాక్షి ఇంపాక్ట్

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్‌టీపీ ప్లాంట్‌కు వెళ్లే రోడ్డులో జుహారాహోటల్ ఎదురుగా పైపులైను లీకేజీకి మరమ్మతులు చేశారు. శనివారం 'సాక్షి' దినపత్రికలో 'పైపులైను లీకేజీతో ధ్వంసం అవుతున్న రహదారి' శీర్షికన ప్రచురితమైన కథనానికి పిడింగొయ్యి పంచాయతీ కార్యదర్శి ఎంరూప్‌చంద్ స్పందించారు. వెంటనే సిబ్బందితో పైపులైనుకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి వేణును పరామర్శించిన ఉప్పలూరి

రాజమహేంద్రవరం రూరల్: మాతృవియోగంతో బాధపడుతున్న మాజీమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను ఆదివారం వైఎస్సార్ సీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఉప్పలూరి వీరవెంకటసత్యనారాయణ పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. చెల్లుబోయిన వేణు తల్లి సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొర్రేడు, వెంకటనగరం గ్రామాలకు చెందిన పార్టీనాయకులు చిట్టూరి వెంకటరావు, దండమూడి అర్జునరావు, మోతార మేష్, మెప్పిలిరాజు, మీసాలసురేష్, మగ్గంరాంబాబు, కొల్లపుశ్రీను, గుమ్మడిభీముడు, యెరుబండిసాయి పరామర్శించిన వారిలో ఉన్నారు.

కల్వర్టుకు శంకుస్థాపన

కడియం: మండల కేంద్రమైన కడియం నుంచి బుర్రిలంక వెళ్లే రోడ్డులో రూ.90 లక్షల అంచనా వ్యయంతో కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదివారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్, మండల పరిషత్ నిధులను ఇందుకోసం వెచ్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, కడియపులంక ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, మండల ఉపాధ్యక్షుడు పంతం గణపతి, మాజీ సర్పంచ్ గట్టి నరసయ్య, చెల్లుబోయిన శ్రీనివాస్, మల్లు శివ పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట నాగిరెడ్డినగర్ మూడుగుళ్ల సెంటర్‌లో ఆదివారం రూ.15 లక్షలతో నిర్మాణం చేపడుతున్న సీసీరోడ్డుకు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు కృషిచేస్తానన్నారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి జి.వెంకటరావు, మాజీ సర్పంచ్ దుద్దుపూడి రామకృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు పెండ్యాల రామకృష్ణ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చప్పాచిన్నారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలక సంస్థ పరిధిలో 16వ డివిజన్‌లో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆదివారం 16వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి చలుమూరి సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆయనకు సన్మానం నిర్వహించారు. ఇన్నీసుపేట బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుతరామారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు మార్ని వాసుదేవ్, రూరల్ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సేవలు విస్తరించాలి



చీరలు పంపిణీ చేస్తున్న సిటీ ఎమ్మెల్యే వాసు తదితరులు

సీటీఆర్ఐ: ఐఏఎస్ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ అందిస్తున్న సేవా కార్యక్రమాలు రాష్ట్ర ప్రజలతో పాటు దేశ ప్రజలకు కూడా అందించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆకాంక్షించారు. ఆదివారం శ్రీ గౌతమి జీవకారుణ్య సంఘంలో ఐఏఎస్ చారిటబుల్ ట్రస్ట్ (ఇంటిగ్రల్ యాడ్ సైన్స్, లండన్) సంస్థ స్థానిక ప్రతినిధి గౌతమ్ టీం ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు, లుంగీలు, చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ట్రస్ట్ రీజనల్ మినిస్టర్ రాంబాబు మాట్లాడుతూ ఈ సంస్థ లండన్ లో 1913లో ఆవిర్భవించినట్లు తెలిపారు. మన దేశానికి 2019లో వచ్చిందని, మన రాష్ట్రానికి గత డిసెంబర్లో వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

వ్యాయామం.. ఆరోగ్యదాయకం

- పర్యావరణ హితమైన వాకింగ్, సైక్లింగ్‌తో సంపూర్ణ వ్యాయామం
- ఎక్సర్‌సైజ్ బైక్స్ రాకతో సైక్లింగ్‌కు తగ్గిన ప్రాధాన్యం
- వాకింగ్‌పై మొగ్గు చూపుతున్న నగర వాసులు



రన్నింగ్ చేస్తున్న విద్యార్థులు



సైక్లింగ్ చేస్తున్న యువత

ప్రకాశంనగర్ : క్రమం తప్పకుండా చేసే వ్యాయామం ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుంది. ప్రస్తుత జీవన శైలిలో మంచి ఆహారంతో పాటు ఆరోగ్యం కోసం నగరవాసులు వ్యాయామాల బాట పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, జాగింగ్, సైక్లింగ్ వంటి కసరత్తులు చేస్తున్నారు. మరికొందరు యోగ, జిమ్‌లకు క్యూ కడుతున్నారు. వాకింగ్‌తో పోలిస్తే సైక్లింగ్‌తోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పలువురు వ్యాయామ విశ్లేషకులు చెబుతున్నారు. ఒక నిమిషం సైక్లింగ్‌తో శరీరంలో 12 క్యాలరీల శక్తి ఖర్చు అవుతుందని, పర్యావరణ హితంతో పాటు మనిషి శరీరంలోని కొవ్వును కరిగించి అధిక బరువు సమస్యను కూడా తొలగిస్తుందని అంటున్నారు. ప్రతి రోజు ఒక అరగంట సైకిల్ తొక్కడం వల్ల శారీరక ధృడత్వంతో పాటు, రోగ నిరోధక శక్తి మెరుగు పడుతుందని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు.

పలువురిలో స్థూలకాయం సమస్యలు

మారిన ఆహారపు అలవాట్ల కారణంగా జనాభాలో అధిక శాతం మంది స్థూలకాయం సమస్యతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువతీ యువకులు అధిక బరువు కారణంగా పలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఫాస్ట్ ఫుడ్స్, కేక్‌లు, పిజ్జా, బర్గర్‌లు వంటి జంక్ ఫుడ్‌లను అధికంగా తినడం వల్ల స్థూలకాయం బారిన పడుతున్నారు. ముఖ్యంగా యువతీ యువకులు, అధిక బరువు సమస్యతో బాధపడుతున్న వారికి సైక్లింగ్ ఓ మంచి వ్యాయామ సాధనం. కాగా ప్రస్తుతం టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో వ్యాయామ సాధనాలైన ట్రెడ్ మిల్, ఎక్సర్‌సైజ్ బైక్ వంటి పలు రకాల వ్యాయామ సాధనాలు ప్రజలకు అందుబాటులోకి రావడంతో సైకిల్ తొక్కే వారి సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతోంది. ప్రతి రోజు సైకిల్ తొక్కడం వల్ల గుండె జబ్బులు, హార్ట్ స్ట్రోక్ వంటి ప్రమాదాలు బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు.

> **ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది**
>
> 
>
> కరోనా విపత్కర పరిస్థితుల అనంతరం ఆహారపు అలవాట్లు, వ్యాయామం, పరిశుభ్రత వంటి విషయాలపై ప్రజలకు ఒక అవగాహన కలిగింది. ముఖ్యంగా మంచి ఆరోగ్యం కోసం శ్రద్ధ వహించడం ఎక్కువైంది. ఇది మంచి విషయం. ప్రతి రోజూ ఒక్క గంట వ్యాయామం చేసేందుకు ప్రతి ఒక్కరూ కొంత సమయం కేటాయించాలి. ప్రసుత్తం మధ్య వయస్కులతో పాటు యువత సైతం పలు వ్యాయామాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. నడక, లేని పక్షంలో ఒక అరగంట సైక్లింగ్‌తో మంచి ఆరోగ్యం సమకూరుతుంది.
>
> – ఏవీడీ ప్రసాదరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు

విద్యార్థులకు బూట్లు, పుస్తకాల పంపిణీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక స్వరాజ్యనగర్‌లోని పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలకు ఆదివారం గౌతమ్ అండ్ టీం ఆధ్వర్యంలో ఐఏఎస్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు బూట్లు, పుస్తకాలు, పెన్నులు ఇతర సామగ్రి అందించారు. ఈ సామగ్రిని ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆళ్ల ఆనందరావు చేతులమీదుగా పలుకు నిర్వాహకురాలు ఘంటా కనకదుర్గ, విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాకు చెందిన ఐఏఎస్ అకాడమీ ద్వారా ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కలిపించారన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. పలుకు నిర్వహకులు ఘంటా కనకదుర్గ విద్యార్థులకు సామగ్రి అందించిన ఐఏఎస్ చారిటబుల్ ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ అండ్ టీం పాల్గొన్నారు.

సమాజ హితానికి లయన్స్ క్లబ్ సేవలు



లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారోత్సవంలో కోటేశ్వరరావు, రంగప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ: సమాజ హితం కోసం రాజమహేంద్రవరం లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు నిరుపమానమని క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు కొనియాడారు. ఆదివారం స్థానిక గోదావరి గట్టు వద్ద వైఎమ్‌వీఏ హాల్‌లో లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం 62 నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన సభ్యులను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉత్సాహం కలిగిన వ్యక్తులను క్లబ్‌లో సభ్యులుగా చేర్చడం ద్వారా క్లబ్ ఉన్నతిని పెంపొందించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. కీ నోట్ స్పీకర్, ఎస్‌బీ గ్రూఫ్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ మట్టపల్లి రంగప్రసాద్ మాట్లాడుతూ లయన్స్ సేవా కార్యక్రమాలు ప్రపంచమంతా విస్తరించాయన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మద్దుల వీఎస్ శ్రీరామ గుప్తా, సెక్రటరీగా వెన్న కుమారస్వామి, ట్రెజరర్‌గా ఉల్లగంటి రాఘవరావు తదితర సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో గ్రంధి వెంకటేశ్వరరావు, ముదునూరు వాణిశ్రీ, గ్రంధి లక్ష్మీ వసంతకుమారి, నేరెళ్ల జయశ్రీ, ఏవీఎస్ సత్యనారాయణ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని ఆలయంలో ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

వచ్చేశాయ్.. వచ్చేశాయ్ జగన్నాథ రథచక్రాల్!



రథంపై కొలువైన శ్రీ జగన్నాథ బలదేవ సుభద్రల విగ్రహాలు



భక్త జన సందోహం మధ్య నగర వీధుల్లో సాగిన రథయాత్ర

- స్వామి దర్శనంతో పులకించిన భక్తజనం
- శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభమైన రథయాత్ర
- నగర వీధుల మీదుగా ఇస్కాన్‌కు చేరిక
- 56 రకాలతో స్వామి వారికి భోగ నైవేద్యం

సీటీఆర్ఐ: శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్రల దర్శనంతో భక్తజనం పులకించిపోయింది. ఆదివారం శ్రీజగన్నాథ స్వామి రథయాత్ర రాజమహేంద్రవరం నగర వీధులలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయానికి రానివారికోసం స్వామి వారే స్వయంగా బయటకు వచ్చి దర్శన భాగ్యం కల్పించడమే జగన్నాథ రథయాత్ర ప్రత్యేకత. స్థానిక శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి జగన్నాథస్వామి రథయాత్ర ప్రారంభమైంది. ఏటా పూరీలో జగన్నాథస్వామి రథయాత్ర అంగరంగ వైభవంగా జరుగుతుంది. అదేవిధంగా జగన్నాథస్వామి కొలువై ఉన్న ఇస్కాన్ మందిరంలో కూడా ఏటా రథయాత్ర నిర్వహిస్తున్నారు. సాధారణంగా రథయాత్ర అంటే ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారు. అయితే జగన్నాథ స్వామి రథయాత్రలో మూలవిరాట్టును ఊరేగించడం విశేషం. ఇస్కాన్ ఆంధ్రప్రదేశ్ జోనల్ సెక్రటరీ రేవతి రమణ్ ప్రభుజీ ముఖ్య అతిథిగా పాల్గొని, రథయాత్ర ప్రారంభించారు. కీర్తనలు, భజనల నడుమ శ్రీ జగన్నాథ బలదేవ సుభద్రల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు. గోరక్షణపేట, ఆజాద్ చౌక్, జాంపేట, ఊర్వశి సెంటర్, బీఈడీ ట్రైనింగ్ కాలేజీ, డీలక్స్ సెంటర్, హెడ్ పోస్టాఫీసు, మహాకాళేశ్వర ఆలయం మీదుగా రథయాత్ర ఇస్కాన్‌కు చేరడంతో ముగిసింది. కమిటీ సభ్యులు రవీంద్ర చైతన్య దాస్ మాట్లాడుతూ రథయాత్రను ఒక్కో ఏడాది ఒక్కొక్క ప్రాంతం మీదుగా నిర్వహిస్తున్నామని గత ఏడాది కంబాల చెరువు నుంచి ప్రారంభించగా ఈసారి శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభించామన్నారు. రథయాత్ర ముగిశాక జగన్నాథస్వామి లీలలపై ప్రవచనం, 56 రకాలతో భోగ నైవేద్యం, దీప హారతులు, అనంతరం ప్రసాద వితరణ జరిగాయి. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.



యాత్రలో పాల్గొన్న ఇస్కాన్ ఆంధ్రప్రదేశ్ జోనల్ సెక్రటరీ రేవతి రమణ్ ప్రభుజీ తదితరులు

ప్రయాణికుడిని కాపాడిన ఆర్‌పీఎఫ్ హెచ్‌సీ చిరంజీవులు

రాజమహేంద్రవరం సిటీ: నడుస్తున్న రైలు ఎక్కబోతూ జారిపడబోతున్న ప్రయాణికుడిని కాపాడి రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ చిరంజీవులు అధికారుల ప్రశంసలు అందుకున్నాడు. వివరాల్లోకి వెళితే శనివారం రాత్రి 17015 విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వెళ్లేందుకు రామచంద్రపురానికి చెందిన నంగి శ్రీను రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. స్టేషన్‌కు చేరే సమయానికి తాను ఎక్కాల్సిన రైలు కదులుతుండటంతో రైలు ఎక్కే ప్రయత్నం చేసిన శ్రీను రైలు నుంచి జారి పోతుండగా అదే సమయంలో విధి నిర్వహణలో ఉన్న చిరంజీవులు శ్రీనును రైలు కిందకు వెళ్లకుండా ప్లాట్‌ఫామ్‌పైకి లాగి ప్రాణాలు కాపాడ గలిగాడు. ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన చిరంజీవులను రైల్వేశాఖ ఉన్నతాధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య మాట్లాడుతూ చిరంజీవులు సాహసానికి రైల్వే శాఖ అవార్డు ఇస్తుందని ఉన్నతాధికారులు తెలిపారన్నారు.



రైలు నుంచి జారిపడుతున్న శ్రీనును కాపాడిన హెచ్‌సీ చిరంజీవులు

గుర్తుకొస్తున్నాయి



ధవళేశ్వరంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ధవళేశ్వరం: అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు 22 ఏళ్ల తర్వాత కలిసిన ఆ స్నేహితులు... తాము తరగతి గదుల్లో చేసిన అల్లరిని, ఆటపాటలను గుర్తుచేసుకొని మళ్లీ చిన్నపిల్లల్లా మారిపోయారు! ధవళేశ్వరం గ్రామంలో కాంతరాజు ప్రాథమిక పాఠశాలలో 2001–2002 విద్యా సంవత్సరంలో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరిని ఒకరు కలుసుకొని వారి వారి కుటుంబాల పరిస్థితులను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యను అభ్యసించిన రోజుల్లో గత స్మృతులను నెమరు చేసుకున్నారు. పాఠశాల స్థాయి విద్యను అభ్యసించిన రోజులు ఎంతో విలువైనవని ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు తమ మనోభావాలను వ్యక్తపరిచారు. తమ సహ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే వారికి అందరూ కలిసికట్టుగా ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు.

దానవాయిదాపేట మెయిన్‌రోడ్డు

- పనులు పూర్తిచేయని కాంట్రాక్టర్
- అగచాట్లు పడుతున్న నగర ప్రజలు
- గగ్గోలు పెడుతున్న వ్యాపారులు
- రోజూ స్తంభిస్తున్న ట్రాఫిక్
- ఈ రోడ్డులోనే కమిషనర్ దినేష్‌కుమార్ నివాసం ఉండేది



దానవాయిపేట మెయిన్‌రోడ్డులో నిత్యం పరిపాటిగా మారిన ట్రాఫిక్ జామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరం నడి బొడ్డున గల దానవాయిపేట మెయిన్‌రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా వదిలివేయడంతో వ్యాపారులు, నగర ప్రజలు, వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బైపాస్ రోడ్డు నుంచి ఏపీ అప్పారావు రోడ్డు వరకూ గల రహదారిని ఆధునీకరించే లక్ష్యంతో ఈ ఏడాది ఫిబ్రవరి 20న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ రెండు కోట్ల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. శంకుస్థాపన చేసిన వెంటనే పనులు ప్రారంభించినా పనుల్లో జాప్యం కారణంగా మూడు నెలలకు పైగా పట్టింది. అయితే పనులు పూర్తి కాకపోవడంతో ఈ రహదారిని వినియోగించే వారంతా అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయడానికి మూడు నెలల సమయం పట్టడంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు అష్ట కష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇంత జరిగినా రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. ఆధునీకరణ పేరుతో లైటింగ్ ఏర్పాటు చేస్తామంటూ ఏర్పాటు చేసిన పిల్లర్లు ప్రమాదాలను తెచ్చి పెడుతున్నాయి.

రోడ్ల పైనే పార్కింగ్

సీసీ రోడ్డు అసంపూర్తి నిర్మాణంతో ద్విచక్ర వాహనాలు, కార్లకు రోడ్డు పార్కింగ్ ప్లేస్‌గా తయారైంది. ఇదే రోడ్డులో కమిషనర్ దినేష్‌కుమార్ నివాసం ఉన్నప్పటికీ దీనిపై పూర్తిస్థాయి చర్యలు చేపట్టిన పరిస్థితులు ఇక్కడ కనిపించడం లేదు. రాజమహేంద్రవరంలో ప్రధాన రహదారి మార్గంగా ఉన్న దానవాయిపేట మెయిన్‌రోడ్డులో అనేక వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఈ వ్యాపార సంస్థల్లో కొనుగోలు చేసేందుకు వచ్చిన కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.



మాజీ ఎంపీ భరత్‌రాం శంకుస్థాపన చేసిన శిలాఫలకం

సాయంత్రమైతే ట్రాఫిక్ జామ్

నగరంలో ప్రధానంగా ఆసుపత్రులకు కేంద్రంగా ఉన్న దానవాయిపేట మెయిన్‌రోడ్డులో ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ రోడ్డులో పాదచారులు నడిచేందుకు సైతం అవకాశం లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇక్కడ సుమారు 100 వరకూ హాస్పిటల్స్ ఉన్నాయి. మోటారు సైకిళ్లు, కార్లు రోడ్ల పైనే పార్కింగ్ చేయడంతో తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. పక్కకు వెళ్లడానికి సైతం వీలు లేకుండా పోతున్నది. సీసీ రోడ్డు పూర్తయిన వెంటనే సైడ్ బెర్మ్‌లు నిర్మాణం చేపట్టాల్సిన కాంట్రాక్టర్ కాలం గడుస్తున్నా చర్యలు చేపట్టక పోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లైటింగ్ కోసం వేసిన పిల్లర్లు ప్రమాదకరంగా..

రెండు కోట్ల వ్యయంలో నిర్మాణం చేపట్టిన ఈ రోడ్డుకు ఒక వైపు లైటింగ్ ఏర్పాటు చేసేందుకు పిల్లర్లు ఏర్పాటు చేశారు. అయితే పనులు అసంపూర్తిగా జరగడంతో రాత్రి సమయాల్లో పిల్లర్లను గుద్దుకుని వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణ పనులను పూర్తి చేసి ఇబ్బందులు లేని సీసీ రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై కాంట్రాక్టరును వివరణ కోరగా వర్షాల కారణంగా ఆలస్యం అవుతుందని త్వరలో పూర్తి చేస్తామన్నారు.



విద్యుత్ స్తంభం నిర్మాణ పనులు మధ్యలో ఆగడంతో ప్రమాదకరంగా మారిన వైర్లు



రోడ్డు పైనే పార్క్ చేసిన కార్లు